# పియానో పాట - మూలం: ఒక అజ్ఞాత ఫ్రెంచి రచయిత

అనువాదం: దాదా హయాత్



పొద్దు వాలుతోంది. ఛాతీలో గుండు దెబ్బ తగిలిన మా మిత్రుడు అర్బైన్‌ని మేమంతా కోటకు మోసుకెళ్ళాం. యుద్ధం వల్ల ఆ కోటకు పెద్ద నష్టం కలగలేదు. కొన్ని తుపాకి గుళ్ళు పైకప్పును ధ్వంస్వం చేశాయి. ప్రధాన మండపం దెబ్బతిన్నది. అక్కడి ఉద్యానవనంలో, ఆ ఉద్యానవనానికి అనుకున్న అడవిలో జరిగింది యుద్ధం. యుద్ధం చిన్నదే అయినా పోరు భీకరంగా సాగింది. ఆ కోటను ఆక్రమించుకున్నకొందరు జర్మన్ సైనికోద్యోగుల్ని మా ఫ్రెంచి సైనికులు తరిమేశారు.

అయితే దుండుగులైన బావేరియన్లు కొంతమంది అందులోని విలువైన సామాను రాత్రికి రాత్రే ఎత్తుకు పోయారు. బోసిపోయిన గదుల్లో మేం కాసేపు తచ్చాడుతూ వుండిపోయాం. చివరికి మొదటి అంతస్తులో వున్న ఓ గదిలో అర్బైన్‌ని దింపవలసిందిగా నేను ఆజ్ఞలు జారీ చేశాను.

అది చాలా విశాలమైన గది. తెల్లని గోడలు పెద్ద పెద్ద కిటికీలు మూడున్నాయా గదికి. వాటి అద్దాలు పగిలిపోయాయి. అయినా రాత్రిపూట చలిగాలి లోపలికి చొరబడకుండా వుండేందుకు ఆ కిటికీల లోతట్టు తలుపులు మూసేయవచ్చు. పధ్నాలుగో లూయీ చక్రవర్తి కాలంనాడు గోడలకు వేసిన పూతలు తుపాకి గుళ్ళ వల్ల అక్కడక్కడ దెబ్బతిన్నాయి. సున్నం పెచ్చులు వూడి నేలంతా చెల్లా చెదురయ్యాయి. ఏమైనప్పటికీ ఆ గది చక్కదనం, దంతంలా మెరుస్తున్న తెల్లనిగోడలు మనసుకు ప్రశాంతత కలిగిస్తున్నాయి- ముఖ్యంగా ఆ వెలుపలి భీకరమైన వాతావరణం నుంచి తప్పించుకొచ్చాక.

ఆ గది మధ్యలో ఒక పియానో నిలబడి వుంది. సామానంటూ ఆ గదిలో ఏదైనా మిగిలితే అది ఆ పియానో ఒక్కటే. చాలా గొప్ప పియానో. ఏదో అద్భుతం జరగడం వల్ల ఇంకా చెక్కు చెదరకుండా వుంది. దుండగులు దాన్ని ఎత్తుకు పోలేదు. ఎలాగో నాశనం చేయకుండా

వదిలేశారు. ఆ గదిలోని తెల్లని నిశ్శబ్దంలో ఒంటరిగా కొయ్యతో నిర్మించిన సమాధిలా వుందా పియానో. దాన్ని చూస్తూనే నా గుండె ఝల్లు మంది. దాన్ని చూస్తుంటే శవాల్ని మోసుకు వెళ్ళడానికి ఏదో గదిలో వుంచిన నల్లని శవపేటికలు గుర్తుకొచ్చాయి. దానివైపు నుంచి చూపులు తిప్పి హతభాగ్యుడైన లెఫ్టినెంట్ అర్బైన్‌వైపు చూశాను. మా వాళ్ళు పక్కవేసి లాంతరు గుడ్డివెలుతురులో ఓ మూలగా అతన్ని పడుకోబెట్టారు. అప్పటికే అతను తెల్లగా పాలిపోయి కనిపిస్తున్నాడు. అతని చొక్కా రక్తంలో తడిసిపోయింది. అతని వైపు నుంచి చూపులు తిప్పి గది మధ్యలో నిలబడి వున్న ఆ బ్రహ్మాండమైన పియానో వంక మరోసారి చూశాను. మనసులో నాకేదో చెప్పలేని భీతి ఆవహించింది. అది పియానోకాదు, లోకంలో అన్నింటికంటే ఉదాసీనంగా మెరుస్తున్న సమాధి.

అతని వైపు నుంచి చూపులు తిప్పి గది మధ్యలో నిలబడి వున్న ఆబ్రహ్మాండమైన పియానో వంక మరోసారి చూశాను. మనసులో నాకేదో చెప్పలేని భీతి ఆవహించింది. అది పియానో కాదు, లోకంలో అన్నింటికంటే ఉదాసీనంగా మెరుస్తున్న సమాధి.

సర్జన్‌మేజరు రాకకోసం ఎదురు చూస్తూ లెఫ్టినెంట్ ఫ్లోరీ, నేనూ అర్బైన్ పక్కనే కూర్చున్నాం. ఫ్లోరీ భారీ మనిషి. ఎప్పుడూ హుషారుగా వుంటాడు. సైన్యం వెలుపల సామాన్య నాగరిక జీవితంలో అతనో సంగీత విద్వాంసుడు. పియానిస్టుగా గొప్ప పేరు గడించాడు. మా రెజిమెంటు యుద్ధానికి బయల్దేరడానికి ముందు అతను మాకు సంగీతం వినిపించేవాడు. మిత్ర రాజ్యాల జాతీయగీతాలు, సైనిక సంగీత బాణీలు, దేశభక్తిగీతాలు ఏవి కావాలంటే అవి పియానో మీద వాయించి మమ్మల్ని ఆనందపరవశుల్ని చేసేవాడు. సంగీత ప్రియులకు శాస్త్రీయసంగీతమూ వినిపించేవాడు. అయితే ఆనాటి సాయంకాలం మాత్రం అతనూ నాలాగే దుఃఖంతో అలసిపోయి వున్నాడు. అందుకే పియానో పక్కనుంచి వెళ్తున్నప్పుడు దానివంక అనాసక్తిగా చూశాడు.

సర్జన్‌మేజరు చివరికి రానే వచ్చాడు. వస్తూనే ఆయన అర్బైన్‌ని సుదీర్ఘంగా పరీక్ష చేసిన మీదట పాతకట్లు తీసేసి మళ్ళీ కొత్తగా కట్లు కట్టాడు. ఆ తర్వాత తల విదిలించాడు. ఆయనే తల విదిలించడం చూస్తూనే నాకంతా అర్థమై పోయింది. ఆయన నన్నో పక్కకు పిల్చుకెళ్ళి అర్బైన్ బతుకుతాడనే ఆశ లేగని చెప్పాడు. అయినా ఆ రాత్రికి తను అర్బైన్ పక్కనే వుంటానని మాట ఇచ్చాడు. ఆ రాత్రికి ఆయన ఎక్కడున్నా ఒకటే. బయట ఉద్యానవనంలో ఆయన డ్యూటీ తెల్లారితేగానీ మొదలవదు.

తెల్లగా బోసిపోయిన ఆ విశాలమైన గదిలో మేం ముగ్గురం. మరో వైపు కదలేని స్థితిలో ఓ క్షతగాత్రుడు. మరోవైపు బ్రహ్మాండమైన ఆ నల్లని ఆకారం. నాకు మొదటినుంచీ ఆ పియానో అక్కడుండడం చాలా అసహజంగా అనిపిస్తోంది. మనసు కీడు శంకిస్తూనే వుంది. లాంతరు తీసుకెళ్ళి ఆ ఫియానో మీద ఓ మూల నుంచాం. ఆ సమయానికి బయటినుంచి ఎటువంటి శబ్దాలూ మాకు వినిపించడం మానేశాయి. చివరికి దూరంనుంచి తుపాకులు పేలుతున్న శబ్దాలు కూడా వినిపించకుండా అణగారిపోయాయి.

కొంత సమయం గడిచింది. మేం నిద్రపోలేదు. అయితే నిటాగ్గా కూర్చొని స్తబ్ధగా ఒక విధమైన సుషుప్తావస్థలో వున్నాం. అంతలో హఠాత్తుగా మాకు అర్బైన్ గొంతు వినిపించింది. నీరసంగా ఎక్కడో దూరం నుంచి వినిపిస్తున్నట్టుగా వున్న గొంతు.

"ఫ్లోరీ, నువ్విక్కడే వున్నావా?"

మేం ఉలిక్కిపడ్డాం. ఫ్లోరీ జవాబిచ్చాడు:

"ఆc, నేనిక్కడే వున్నాను. ఫ్రెస్నెల్, మేజర్‌కూడా నాతోపాటే వున్నారు. ఏం కావాలో చెప్పు.' '

"ఫ్లోరీ! నాకు - నాకు పియానో వినాలనుంది," అన్నాడు అర్బైన్.

"మైడియర్ ఫెలో! నువ్వెట్టి పిచ్చివాడివి," లేని హుషారు బలవంతంగా కొని తెచ్చుకుంటూ అన్నాడు ఫ్లోరీ. "నీకిప్పుడు నిద్ర చాలా అవసరం. ముందు నీకు నయం కానీ. ఆ తర్వాత ఎంత సంగీతం కావాలంటే అంత సంగీతం వినిపిస్తాను. సరేనా?"

"లేదు ఫ్లోరీ, నాకింక నయం కాదు. నేను చెప్పేది విను. మీరు ముగ్గురూ- మీరంతా నేను చెప్పేది వినండి. నాకు సంబంధం కుదిరిన అమ్మాయి మా వూరు అంజోలో వుంది. ఆమె పేరు ఫేనీ. చాలా అందంగా వుంటుంది. చాలా మంచిది. చాలా తెలివైంది. ఆమె కూడా ఇలాంటి కోటలోనే వుంటుంది. ఇలాంటి తెల్లని విశాలమైన గదిలోనే గొప్ప పియానో- సరిగ్గా ఇలాంటిదే- అక్కడ కూడా ఒకటుంది. వేసవి సాయంకాలాల్లో అద్భుతంగా ఆమె పియానో వినిపిస్తుంది. ఇక్కడ మనం వున్నట్టే అక్కడకూడా శ్రోతలం ముగ్గురమో నలుగురమో వుంటాం. అప్పుడు ఇలాగే వెలుతురు మసగ్గా వుంటుంది. నా కోసం పియానో వినిపించు ఫ్లోరీ. నేనామెను చూడాలి. మళ్ళీ నేనామె ఇంట్లో వుండాలి. ఆమె సాన్నిధ్యంలోకి వెళ్ళాలి. ఆమె వినిపించే పాట వినిపించు. ఏ పాట వినిపించాలో నేను చెబుతాను. నా కోసం ఫ్లోరీ. నువ్వెప్పుడూ నా మాట కాదనవుగా. వినిపించవూ?"

మేం వణికాం. మేజరు గొణిగాడు:

"వినిపించు. తనింక బతుకుతాడనే ఆశలేదు."

ఫ్లోరీ లేచి వెళ్ళి పియానో తెరిచాడు. అర్బైన్ వూపిరి సలపనట్టుగా అన్నాడు:

"థ్యాంక్స్ ఫ్లోరీ! ఇలారా. నీ చెయ్యిలా ఇవ్వు. నువ్వు నిజమైన స్నేహితుడివి. 'షోపిన్ ఎటూడే ఇన్‌లా' వినిపించు. నీకా పాట తెలుసుగా?"

ఆ విధంగా వేదనాభరితమైన ఆ నిశ్శబ్దంలో, బాధాకరమైన ఆ గదిలో చిత్రాతిచిత్రంగా క్రూరాతిక్రూరమైన సంగీతసభ ప్రారంభమైంది. కేవలం ఊహించుకోవలసిందే ఆ క్రౌర్యం.

అస్థిరంగా వున్న లాంతరు గుడ్డివెలుతుర్లో నేను ఫ్లోరీ మొహం వంక చూసాను. తెల్లగా పాలిపోయి గంభీరంగా వుందతని మొహం. ఏదో ప్రార్థనలో వున్నట్టుగా అతను పియానో వాయిస్తున్నాడు. అంత గొప్పగా తన జీవితంలో ఎప్పుడూ అతను పియానో వాయించి వుండడు.

నెమ్మదిగా సంగీతంలోని మాయాజాలం కొద్ది కొద్దిగా మమ్మల్ని ఆవహించనా

రంభించింది. మేం అంతా మర్చిపోయాం. మాకు కాలం గుర్తులేదు. స్థలం గుర్తులేదు. వాస్తవం గుర్తులేదు. మృత్యువు గుర్తులేదు. అన్నీ మర్చిపోయాం. ఆ పియానో చుట్టూ కూర్చున్న మేము ఎంతోకాలం తర్వాత కలుసుకున్న ఆత్మీయుల్లా సంతోషంగా మారిపోయాం.

ఫ్లోరీ పాట ముగించగానే చీకటికీనీడల్లోంచి అర్నైన్ గొంతు మళ్ళీ వినిపించింది.

“అదిగో ఆమె కనిపిస్తోంది. ఇక్కడే వుంది. మనతోనే వుంది. మళ్ళీ ప్రారంభించు ఫ్లోరీ. షుమన్ కృతి 'పాపిలాన్స్' వినిపించు. ఆ కృతి నువ్వెంత బాగా వినిపించగలవో ఆమె కూడా అంత బాగా వినిపించగలదు తెలుసా? కాదనకు ఫ్లోరీ. షుమన్ జర్మనీ జాతి వాడని నాకు చెప్పొద్దు. ఆయన నిజంగా పరిపూర్ణ సంగీతకారుడు. నేనా కృతి మళ్ళీ వినాలి. మా వూళ్ళో ఆనాటి ఆ వేసవి సాయంకాలం విన్నట్టుగానే మళ్ళీ వినాలి. వద్దు, నేను చావనని నాతో చెప్పొద్దు. నేను బ్రతకనని నాకు తెలుసు. మృత్యువును నేనిప్పుడు అనుభవించగలుగుతున్నాను. నాతో ఇంకేమీ చెప్పొద్దు. ప్రారంభించు.”

**వేదనా భరితమైన ఆ నిశ్శబ్దంలో, బాధాకరమైన ఆ గదిలో చిత్రాతిచిత్రంగా క్రూరాతిక్రూరమైన సంగీత సభ ప్రారంభమైంది. కేవలం ఊహించుకోవలసిందే ఆ క్రౌర్యం.**

ఫ్లోరీ వణికిపోతూ 'పాపిలాన్స్' వినిపించనారంభించాడు. ఆ అమరకృతిలో విరామం వచ్చినప్పుడల్లా మేం అర్నైన్ వైపు తిరిగి తిరిగి చూస్తున్నాం. నెమ్మదిగా అతను అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. ఆ స్థితిలోనే అతను చిన్నగా కలవరించడం మాకు వినిపించింది.

“థ్యాంక్స్ ఫేనీ థ్యాంక్స్.”

అతని చిత్తభ్రాంతి నా మీద ఎంత తీవ్రంగా పనిచేసిందంటే ఆ సమయంలో బంగారుకురులతో ఓ తెల్లని యువతి వాస్తవంగా ఆ గదిలో తిరుగుతున్నట్టే నాకనిపించింది. నేనింకా ఆ భ్రమలోనే వున్నాను. అంతలో పక్కమీదికి వంగి అర్నైన్‌ని పరీక్షగా చూస్తున్న మేజరు చప్పున వెనక్కి తిరిగి ఫ్లోరీ భుజం మీద చెయ్యి వేశాడు. ఫ్లోరీ ఇంకా పియానో వాయిస్తూనే వున్నాడు. మేజర్ గద్గదస్వరంతో అన్నాడు:

**అతని చిత్తభ్రాంతి నామీద ఎంత తీవ్రంగా పనిచేసిందంటే ఆ సమయంలో బంగారు కురులతో ఓ తెల్లని యువతి వాస్తవంగా ఆగదిలో తిరుగుతున్నట్టే నాకనిపించింది.**

“ఆపు. తనింక వినలేడు.”

ఆ అద్భుతమైన సంగీతఝురి ఒక్కసారిగా ఆగిపోయింది. బాధాకరమైన నిశ్శబ్దం నలువైపులా అలుముకుంది. ఫ్లోరీ పియానో మెట్లమీద మోచేతులానించాడు. దుఃఖం వల్ల కొంత, సంగీతం వల్ల కొంత, నిద్రలేమి వల్ల కొంత వివశుడైపోయి అతను ఏడ్చేశాడు.

రెండో యుద్ధంకథ

# బెర్లిన్‌లో

ఇంగ్లీషు మూలం:
మేరీ బాయిల్ ఓ' రైలీ

అనువాదం:
దాదాహయాత్




బెర్లిన్ నగరం వెలుపలికి పాక్కుంటూ వెళ్తున్న ఆ రైలు ఆడవాళ్ళతో పిల్లలతో నిండిపోయింది. జవసత్వాలున్న మగవాడు ఒక్కడూ అందులో లేడు. ఓ కంపార్ట్‌మెంటులో జబ్బుపడ్డట్టు బలహీనంగా కనిపిస్తున్న ఓ పెద్దావిడ పక్కనే తల నెరిసిన ఓ ముసలి సైనికుడు కూర్చున్నాడు. ఛుకు ఛుకు ఛుకు ఛుకు శబ్దాల మధ్య ఆ పెద్దావిడ ఏవో ఊహల్లో పడిపోయి, “ఒకటి, రెండు, మూడు,” అని లెక్కపెడుతుండడం ప్రయాణీకులందరూ వింటున్నారు. ఆగి ఆగి ఆవిడ అవే మాటలు గబగబా మళ్ళీ మళ్ళీ పలుకుతోంది. ఇద్దరమ్మాయిలు ఆవిడ వింత ప్రవర్తన చూసి అనుచితమైన వ్యాఖ్యానాలు చేసి అనాలోచితంగా నవ్వారు. ఓ పెద్దాయన మందలించాడు. నిశ్శబ్దం అలుముకుంది.

“ఒకటి, రెండు, మూడు,” వేటిగురించి స్పృహలేని పెద్దావిడ మళ్ళీ లెక్కపెట్టింది. ఆ ఇద్దరమ్మాయిలు మళ్ళీ మూర్ఖంగా నవ్వారు. తల నెరిసిన ముసలి సైనికుడు ముందుకు వంగాడు.

“ఫ్రాలీన్,” గంభీరంగా అన్నాడతను. “ఈ అభాగ్యురాలు నా భార్య అని చెబితేనైనా మీరు నవ్వడం ఆపుతారనుకుంటాను. మేమిప్పుడే మా ముగ్గురు కొడుకుల్ని యుద్ధంలో పోగొట్టుకున్నాం. యుద్ధం జరుగుతున్న ఫ్రంటుకు ఇక నేను వెళ్ళేముందు తనని పిచ్చాసుపత్రిలో చేర్పించాలి.”

కంపార్టుమెంటులో భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది.